పత్రికా ప్రకటన

# విశాఖ ఐటీఐఆర్ ప్రతిపాదన అడుగు ముందుకు వేయలేదు

## రాజ్యసభలో శ్రీ వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: విశాఖపట్నం కేంద్రంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్టిమెంట్ రీజియన్ (ఐటీఐఆర్)ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆగస్టు 26, 2014లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన ఇంకా ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) పరిశీలనకు పంపలేదని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి శ్రీ అల్ఫోన్స్ కన్నాంతనమ్ శుక్రవారం రాజ్యసభలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు రాతపూర్వకంగా జవాబిస్తూ వెల్లడించారు.

ఈ జాప్యానికి కారణాలను మంత్రి వివరిస్తూ భువనేశ్వర్‌లో ఐటీఐర్ ఏర్పాటు కోరుతూ 2010లో ఒడిస్సా ప్రభుత్వం ప్రతిపాదనను సమర్పించింది. దీనిని పరిశీలించిన కేబినెట్ కమిటీ ఐటీఐఆర్ ఏర్పాటులో ఇప్పటి వరకు ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానాన్ని సమగ్రంగా పునఃపరిశీలించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. దీనికి అనుగుణంగా ఐటీఐఆర్ విధానాన్ని పునఃపరిశీలించిన పిమ్మట అందులో సవరణలు చేయవలసి అవసరం ఉన్నట్లుగా గుర్తించడం జరిగింది. ఐటీఐఆర్ విధాన సవరణ కోరుతూ కేబినెట్ కమిటీకి ఒక నోట్‌ను కూడా సమర్పించినట్లు

మంత్రి చెప్పారు. ఒకవేళ ఐటీఐఆర్ విధాన సవరణ జరిగితే ఆ దరిమిలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) పరిశీలన కోసం పంపుతామని మంత్రి వివరించారు.

# రైల్వే కాంట్రాక్ట్ పనులకు 'జీఎస్టీ' బ్రేక్!

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత దక్షణ మధ్య రైల్వేలోని ఓపెన్ లైన్, కన్స్ట్రక్షన్ ఆర్గనైజేషన్‌లో కాంట్రాక్టర్లు తాత్కాలికంగా పనులు నిలిపివేసిన విషయం వాస్తవమేనని రైల్వే సహాయ మంత్రి శ్రీ రాజెన్ గొహైన్ అంగీకరించారు. రాజ్యసభలో శుక్రవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసినప్పటికీ శాఖాపరమైన వనరులను తరలించి ఎక్కడ అవసరమైతే అక్కడ ట్రాక్ భద్రత పనులు కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. జీఎస్టీ అమలుకు ముందు ఆమోదించిన టెండర్ రేట్లకు జీఎస్టీని వర్తింపచేయడాన్ని నిరసిస్తూ దక్షిణ మధ్య రైల్వేలోని ఆరు డివిజన్లలో సుమారు 600 కోట్ల రూపాయల విలువైన 415 పనులను కాంట్రాక్టర్లు నిలిపివేసిన మాట నిజమేనని రైల్వే మంత్రి తన సమాధానంలో ఒప్పుకున్నారు.

కాంట్రాక్టర్లు తాత్కాలికంగా పనులు నిలిపివేయడంతో రైల్వే ఉన్నతాధికారులు రంగంలోకి దిగి జీఎస్టీ అమలులో వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించారని మంత్రి తెలిపారు. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో కాంట్రాక్టర్లంతా పనులను తిరిగి ప్రారంభించారని కూడా ఆయన వివరించారు.